క్లుప్తంగా

'గాలికుంటు' నివారణకు టీకా తప్పనిసరి


పశువులకు టీకా ఇస్తున్న వైద్యురాలు

నవాబుపేట: రైతులు వారి పశువులకు తప్పనిసరిగా గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్య ఏడీ డాక్టర్ ప్రహ్లాద్ అన్నారు. నవాబ్‌పేట మండలం ఎక్‌మామిడిలో శుక్రవారం మూడో విడత గాలికుంట టీకా కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పశువులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, కావున పశువులకు తప్పనిసరిగా టీకా ఇప్పించాలని చెప్పారు. గాలికుంట వ్యాధి సోకితే పశువులకు అబార్షన్ అయ్యే ప్రమాదం ఉందని, పాలు ఇచ్చే పశువులు పాలివ్వడం మానేస్తాయని పేర్కొన్నారు. జబ్బుల బారిన పడకుండా ముందస్తుగా టీకా ఇప్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీప్రియ, సిబ్బంది జేమియా, సత్యయ్య, హాజీ, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కొత్త తహసీల్దార్లు


తాండూరు.. తారాసింగ్


బంట్వారం.. ప్రవీణ్‌కుమార్

తాండూరు రూరల్: తాండూరు మండల తహసీల్దార్‌గా కె.తారాసింగ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ చిన్నప్పల నాయుడు షాబాద్‌కు బదిలీపై వెళ్లారు. సంగారెడ్డి జిల్లా మనూర్ తహసీల్దార్‌గా పని చేస్తున్న తారాసింగ్ ఇక్కడికి వచ్చారు.

బంట్వారంలో..

బంట్వారం: సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, ఆశాజ్యోతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తామని పేర్కొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: కుల్కచర్ల తహసీల్దార్‌గా మురళీధర్, చౌడాపూర్ మండల తహసీల్దార్‌గా ప్రభులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విధి నిర్వహణలో అందరితో కలిసి ముందుకుసాగుతామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.


కుల్కచర్ల.. మురళీధర్


చౌడాపూర్.. ప్రభులు

అభివృద్ధి పనుల పరిశీలన

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వినియోగించుకోవాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని, ఇంట్లో వినియోగించిన నీటిని అందులోకి మళ్లించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్ర బృందం సభ్యులు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా శుక్రవారం జినుగుర్తి గ్రామంలో బృందం సభ్యులు పర్యటించి ప్రజలతో మాట్లాడారు. మరుగుదొడ్ల వినియోగంపై ఆరా తీశారు. జీపీ కార్యాలయం, పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలని చెప్పారు. తడి,పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. శ్మశాన వాటిక, డంపింగ్‌యార్డ్‌లను తనిఖీ చేశారు. అనంతరం గ్రామం పంచాయతీలో ఉన్న రికార్డులను సెల్‌ఫోన్‌లో చిత్రికరించి, ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. సర్పంచ్ రత్నమ్మ, ఉప సర్పంచ్ హసీం అలీ, జీపీ కార్యదర్శి రాములు, గ్రామస్తులు ఉన్నారు.

స్టే రావడం హర్షణీయం

పూడూరు: కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న రాహుల్ గాంధీపై.. బీజేపీ పెట్టిన పరువునష్టం దావాపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడంపై ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్‌లు హర్షం వ్యక్తంచేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అజీం పటేల్ తదితరులు ఉన్నారు.

కమ్మేస్తున్న కంపచెట్లు

- చెరువులో తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం
- నిరుపయోగంగా తూములు
- కట్టపై పెరిగిన తుమ్మలు
- పగుళ్లు ఏర్పడినా పట్టని వైనం



కొడంగల్ చెరువులో పెరిగిన కంప చెట్లు (ఇన్‌సెట్‌లో) నిరుపయోగంగా ఉన్న ఎల్లమ్మ తూము

కొడంగల్: ఎడతెరిపి లేని వర్షాలకు కొడంగల్ చెరువు నిండుకుండలా మారి.. అలుగు పోస్తోంది. అయితే చెరువులో ఏపుగా కంప చెట్లు పెరగడం వలన నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో పాటు, రెండు తూములు నిరుపయోగంగా మారాయి.

కొంతమందికే సాగునీరు

మండలంలో రెండో పెద్ద చెరువుగా పేరు గాంచిన కొడంగల్ చెరువు కింద 550 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు రెండు వందల మంది రైతులకు చెరువు కింద భూములు ఉన్నాయి. చెరువు నిండితేనే పంటలు పండుతాయి. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చేసిన మరమ్మతులు సఫలం కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. యేటా చెరువు ఆయకట్టుకు తైబంది నిర్వహించి, కొంత మంది రైతులకు మాత్రమే సాగునీరు వదులుతున్నారు. మిగతా రైతులు వర్షాధార పంటలపై ఆధారపడటం గమనార్హం.

కట్టకు పగుళ్లు

చెరువులో మురికి తుమ్మలు బాగా పెరిగాయి. గతంలో మిషన్ కాకతీయ పథకంలో వాటిని తొలగించి, చెరువులోనే పడేయడంతో అవి మళ్లీ పెరిగాయి. చెరువు కట్టపై ఇరువైపులా చెట్లే ఉన్నాయి. కొడంగల్ నుంచి పాత కొడంగల్ గ్రామానికి వెళ్లడానికి చెరువు కట్టపై నుంచి దారి ఉంది. కట్టపై కంప చెట్లు ఉండటం వలన.. అక్కడక్కడా పగుళ్లు ఏర్పడ్డాయి. ఇదిలా ఉండగా.. చెరువులో పెరిగిన చెట్లతో సాగునీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. దీంతో చెరువు కింద 550 ఎకరాల ఆయకట్టు ఉండగా.. అందులో యేటా వందలోపు ఎకరాలకు మాత్రమే సాగునీరు ఇస్తున్నారు. మిగతా రైతులు ఇతర పంటలపై ఆధారపడ్డారు. చెరువులో పూడికతీత, చెట్లను తొలగిస్తేనే నీటి సామర్థ్యం పెరిగి, ఆయకట్టు కింద ఉన్న మొత్తం భూములకు సాగునీరు అందుతుంది.

పాటు కాల్వకు మరమ్మతులు శూన్యం

పెద్ద చెరువుకు ఒకటే పాటు కాల్వ ఉంది. అది నిండుగా పారితేనే చెరువు నిండుతుంది. నిర్వహణ లోపం వలన అందులో తుమ్మ చెట్లు మొలిచాయి. ఫలితంగా చెరువులోకి నీరు సరిగ్గా రావడం లేదని స్థానిక రైతులు తెలిపారు. బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లి శివారులో నుంచి వరద కొడంగల్ చెరువులోకి వస్తోంది.

నిరుపయోగంగా తూములు

పెద్ద చెరువుకు రెండు తూములు ఉన్నాయి. 20 ఏళ్లకు పైగా ఎల్లమ్మ తూము నిరుపయోగంగా ఉంది. చెరువులో పూర్తి స్థాయి నీటి మట్టం లేకపోవడం వలన కుక్కల తూము నుంచి మాత్రమే సాగునీరు వదలగా.. కొంత మంది రైతుల పొలాలకు మాత్రమే అందుతోంది.

కర్షకులకు కలుపు కష్టాలు

వేధిస్తున్న కూలీల కొరత

ధారూరు: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పంట పొలాల్లో పేరుకుపోయిన కలుపును తీయించాలనీ రైతులు.. కూలీల కోసం పోటీ పడుతున్నారు. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. రోజుకు రూ.300 నుంచి రూ.600లకు కూలి ఇస్తేనే పనిచేస్తామని కూలీలు స్పష్టం చేస్తున్నారు. కలుపు పెరిగితే పంట ఎదుగుదల ఆశించినంతగా ఉండదని భావించిన బడా రైతులు అడిగినంత కూలీ ఇస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులు మాత్రం కటుంబ సభ్యులతో కలుపు తీసుకుంటున్నారు.

కప్పేసిన కలుపు

ఒకటి, రెండు రోజుల్లో అయిపోయే కలుపు ఏకంగా 15 రోజుల వరకు సమయం తీసుకుంటుందని రైతులు వాపోతున్నారు. పంటను కలుపు కప్పేసిందంటున్నారు. వేసవిలో ఉపాధి పథకం కింద కూలీలకు పని దినాలు కల్పిస్తున్నారని, దీని వలన వారికి వంద రోజుల ఉపాధి లభించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. సాగుకు ఉపాధి కూలీలను అనుసంధానం చేస్తే తమకు అన్ని విధాల కలిసొస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.


అవుసుపల్లి గ్రామ సమీపాన కందిపంటలో ఏపుగా పెరిగిన కలుపు

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత

ఈద్గాకు భూదానం చేసిన సర్పంచ్

యాలాల: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని హాజీపూర్ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రూ.5లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ముస్లింల శ్మశాన వాటిక నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబాతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లా డారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో మండలానికి భారీగా నిధులు వచ్చాయని, గ్రామంలో శ్మశాన వాటిక ప్రహరీకి రూ.5లక్షలు, మసీదులో అభివృద్ధి పనులకు రూ.4లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటితో పాటు ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామంలో అవసరమైన చోటా సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టనున్నట్లు చెప్పారు.

భూదానం

రంజాన్, బక్రీద్ పర్వదినాన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గా నిర్మాణం కోసం తన పొలం నుంచి 5 గుంటల భూమిని దానం చేస్తున్నట్లు సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ ప్రకటించారు. మసీదు ఇమామ్ షకీల్, సదర్ ఆటో మహబూబ్, బడే మహబూబ్, ఖాసీం, ఇస్మాయిల్, సయ్యద్ సలీం, ఆమీర్, అక్బర్, కరీం, షాబుద్దీన్, అజ్గర్, గ్రామస్తులు రాజేందర్ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి

పరిగి: వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురికి పార్టీలో పదవులు కేటాయిస్తూ నియామకపత్రాలు అందజేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా శోభారాణి, జిల్లా ఉపాధ్యక్షుడిగా రాములు నాయక్, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడిగా దొంగఎన్కెపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డిని నియమిస్తూ వారికి నియమకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళలకు సమాన హక్కులు ఉన్నాయని, వారు రాజకీయాల్లో రాణించాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి, శ్రీనివాస్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాలను అందజేస్తున్న టీఆర్ఆర్

హరితహారం వేగవంతం చేయండి

- చనిపోయిన వాటి స్థానంలో కొత్త మొక్కలు
- ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య

మర్పల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య పంచాయతీ కార్యదర్శి, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్లూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలించి మాట్లాడారు. మర్పల్లి మండలం పట్లూర్ నుంచి సంగారెడ్డి జిల్లా బుదేర సరిహద్దు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా గతేడాది నాటిన మొక్కల్లో ఎవైనా చనిపోతే ఆ పాదుల్లో కొత్త మొక్కలు నాటించాలని సూచించారు.

మొక్కలు, కట్టెలు సిద్ధం

చనిపోయిన వాటి స్థానంలో కొత్తగా నాటేందుకు 2 వేల మొక్కలు, వాటికి రక్షణగా కట్టెలు పట్లూర్ గ్రామ పంచాయతీ నిధులతో కడియం నర్సరీ నుంచి కొనుగోలు చేసి, శుక్రవారం పట్లూర్‌లో డంపింగ్ చేసినట్లు పేర్కొన్నారు. మొక్కలు నాటేందుకు ఇప్పటికే గుంతలు తీయించామని, శనివారం నుంచి మొక్కలు నాటిస్తామని వెల్లడించారు. అదే విధంగా మర్పల్లి జీపీ నుంచి 1,500 మొక్కలు, వాటికి సపోర్ట్‌గా కట్టెలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. స్థానిక ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పెద్దాపూర్ సరిహద్దు వరకు మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటిన వెంటనే ఉపాధికూలీలతో మొక్కచుట్టూ సాసర్ చేయించి నీరు పోయించాలని ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ ఇందిర, ఏపీఓ అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మికాంత్, ఉపాధీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

పుష్కరకాలంగా వెట్టిచాకిరీ చేస్తున్నాం

- అరకొర జీతంతో గడుపుతున్నాం
- క్రమబద్ధీకరించి ఆదుకోండి
- తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్

కొడంగల్ రూరల్: తెలంగాణ సమగ్ర శిక్ష విద్యాశాఖలో 2012 నుంచి వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ విజయ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. జిల్లా, మండల స్థాయిలో ఎంఐఎస్, కంప్యూటర్ ఆపరేటర్, మెసెంజర్స్, ఐఈఆర్‌పీ, క్లస్టర్ స్థాయిలో సీఆర్‌పీలుగా, పాఠశాల స్థాయిలో పీటీఐలుగా విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తూ.. ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారని, కానీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు కనీస వేతనం అమలుచేస్తూ రెగ్యులర్ చేయాలని కోరారు. ఎస్ఎస్ఏ సంఘం సభ్యులు చంద్రశేఖర్, వేణుగోపాల్, వెంకట్‌రావు, రాఘవేందర్, శ్రీనివాస్, దస్తప్ప ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ సంఘం సభ్యులు

ఉచిత పశువైద్య శిబిరం

యాలాల: హాజీపూర్‌లో శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా సమితి తాండూరు వారి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. రిటైర్డ్ వెటర్నరీ ఏడీ డాక్టర్ పున్నయ్య పర్యవేక్షణలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. కొన్ని పశువులకు గర్భధారణ సమస్యలపై పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి, సమితి కన్వీనర్ వీరేశం గౌడ్, సేవా సభ్యులు ప్రవీణ్‌కుమార్, గౌరిశంకర్, మహేశ్, బాలరాజ్ ఉన్నారు.

దవాఖాన అప్‌గ్రేడ్ అయ్యేనా?

- పెరుగుతున్న రోగుల తాకిడి
- 24 గంటల వైద్య సేవలకు డిమాండ్
- సర్వసభ్య సమావేశంలోనూ తీర్మానం

దౌల్తాబాద్: దౌల్తాబాద్ ప్రాథమిక ఆరగ్యో కేంద్రంలో 24/7 సేవలు అందించాలన్న డిమాండ్ పెరుగుతోంది. అందులో భాగంగా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని పీహెచ్‌సీ పరిధి ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు గతంలో సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అయినా అమలుకు నోచుకోలేదు. దీంతో ఇప్పట్లో అప్‌గ్రేడ్ అయ్యేనా అని పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

9 సబ్‌సెంటర్ల ద్వారా సేవలు

పీహెచ్‌సీ పరిధిలోని 33 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. అందులో 9 సబ్ సెంటర్లు దౌల్తాబాద్-1, దౌల్తాబాద్-2, మాటూరు, కుదురుమళ్ల, ఈర్లపల్లి, గోకఫసల్‌వాద్, చంద్రకల్, బాలంపేట, దేవర్‌ఫసల్‌వాద్ గ్రామాల్లో సేవలు అందిస్తుండగా.. మిగిలిన 24 గ్రామాల ప్రజలకు ఈ ఆస్పత్రిలోనే సేవలు పొందుతున్నారు.


దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

57 రకాల వైద్యసేవలు..

పీహెచ్‌సీ ల్యాబ్‌లో సీబీపీ, థైరాయిడ్, హెచ్‌ఐవీ, టీబీ, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, ఫైలేరియా లాంటి 57 రకాల టెస్టులు చేస్తున్నారు.

ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు

దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో నేషనల్ క్వాలిటీ కంట్రోల్ సొసైటీ (ఎన్‌క్యూఏఎస్) కింద కేంద్రం గుర్తించింది. ఇందుకుగాను ఆ సంస్థ యేటా రూ.3లక్షల నిధులను అభివృద్ధికి కేటాయిస్తోంది.

24గంటల పాటు..

ఆస్పత్రిలో నిత్యం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5వరకు వైద్య సేవలు అందుతున్నాయి. రోజు వారిగా ఔట్ పేషంట్లు 100 నుంచి 120 మంది పైగా సేవలు పొందుతున్నారు. నెలకు రెండు చొప్పున ప్రసవాలు జరుగుతున్నాయి. అత్యవసర సమయాల్లో తాండూరు, కోస్గి, కొడంగల్ ఆస్పత్రులకు వెళ్లాలంటే 20కిమీ ప్రయాణించాల్సిన పరిస్థితి. దీంతో 24గంటల పాటు వైద్యసేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

- ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తి అధికం
- పాలు ఇవ్వడం బిడ్డకు ఆరోగ్యకరం
- తల్లిపాల వారోత్సవాల్లో సీడీపీఓ కాంతారావు తదితరులు


తాండూరు రూరల్: మల్కాపూర్‌లో ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది తదితరులు

మోమిన్‌పేట: 'తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం వలన తల్లీ బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. బిడ్డకు ముర్రు పాలే శ్రీరామ రక్ష' అని సీడీపీఓ కాంతారావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక బాలికల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిడ్డ పుట్టగానే ముర్రుపాలను పట్టించాలని, వాటిలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. దీంతో ఆరు రోగాల నుంచి బిడ్డ రక్షణ పొందుతుందని, బిడ్డకు తల్లిపాలు దేవుడు ఇచ్చిన వరమని పేర్కొన్నారు. పాలు ఇవ్వాలని అనుకున్న తల్లికి పాలు వస్తాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు తల్లీ బిడ్డకు క్షేమమని సూచించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారం తీసుకునే విధంగా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పలత, సీహెచ్‌ఓ శారద, ఏఎన్ఎం విమల, మలేరియా నిరోధక అధికారి రవీందర్ బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, అమల, నాగలక్ష్మి, గర్భిణులు, కిశోర బాలికలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

డబ్బాపాలు వద్దు..

తాండూరు రూరల్: డబ్బాపాలు వద్దు.. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని మల్కాపూర్ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పుట్టినబిడ్డకు తల్లిపాలు పట్టించాలని, డబ్బాపాలతో పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ గీత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కనీసం రెండేళ్ల పాటు..

కొడంగల్ రూరల్: తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని, పుట్టిన వెంటనే పిల్లలకు ముర్రుపాలు తాగించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దశమ్మ, ప్రభ అన్నారు. కొడంగల్ మండలం అంగడిరాయిచూర్‌లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో వారు మాట్లాడారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 6నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలని, అనంతరం ఇతర ఆహారం అందించాలని సూచించారు. కనీసం రెండేళ్ల పాటు తల్లి బిడ్డకు పాలు ఇస్తే.. పిల్ల ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. బాలింతలు, గర్భిణులు సమయానుకూలంగా పౌష్టికాహారం తీసుకోవడానికి శ్రద్ధ చూపాలని చెప్పారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు రత్నమ్మ, రజిత, సుశీల, అంబుబాయి, ఆశ కార్యకర్తలు, ఆయాలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డకు క్షేమం..

జిల్లా ఐసీడీఎస్ సంక్షేమ అధికారి లలితకుమారి

ధారూరు: బిడ్డకు పాలిచ్చే తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువేనని ధారూరు ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఐసీడీఎస్ సంక్షేమ అధికారి లలితకుమారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. తల్లులకు రక్తహీనత, ఎముకల బలహీనత వైద్యులే చెబుతున్నారని, ముఖ్యంగా బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా ప్రసవం అనంతరం అయ్యే రక్తస్రావాన్ని అదుపు చేస్తాయని వివరించారు. అనంతరం లలితకుమారి మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని చెప్పారు. కొందరు సౌందర్యం తగ్గుతుందని, మరికొందరు, ఉద్యోగరీత్యా బిడ్డలకు పాలివ్వడం లేదని, అది తల్లీ బిడ్డకు క్షేమం కాదని చెప్పారు. జెడ్పీటీసీ సుజాత, ఎంపీడీఓ చంద్రశేఖర్, వికారాబాద్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుశీల, నర్సమ్మ, కళావతి, శాంతాబాయి ఉన్నారు.


చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న లలితకుమారి, ఎంపీపీ తదితరులు

సంక్షిప్త వార్తలు

◆ కొనసాగుతున్న ఎల్ఎఫ్ఎన్ శిక్షణ

బొంరాస్‌పేట: ప్రాధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్, లిటరసి అండ న్యూమరసి) శిక్షణా కార్యక్రమం మూడోరోజు శుక్రవారం జరిగింది. శిక్షణకు మండలంలో 45, దుద్యాలలో 20 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. శిక్షణను ఎంఈఓ రాంరెడ్డి పర్యవేక్షించారు.

◆ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే న్యాయం

పరిగి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ అరవిందర్‌రావు అన్నారు. చిట్యాల గ్రామానికి చెందిన జ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా.. మంజూరు అయింది. ఈ మేరకు శుక్రవారం రూ.70వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

◆ 6న ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్: శ్రీచెన్నకేశవ స్వామి, శ్రీరాఘవేంద్రస్వామి దేవాలయాల ప్రాంగణంలో ఆదివారం అధిక శావణమాసంను పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయాల సేవాకర్తలు తెలిపారు. ఆదివారం స్వామివారికి అభిషేకం, అనంతరం 33మంది దంపతులతో 33హోమ కుండములతో 33శ్రీసుదర్శన హోమాలు చేయనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 94411 62669, 99899 69905లను సంప్రదించాలని సూచించారు.

◆ ఎల్లమ్మ సన్నిధిలో తిరుపతిరెడ్డి



కొడంగల్: పోలేపల్లిపల్లి శ్రీ రేణుకా ఎల్లమ్మను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

◆ రైతు పక్షపాతి కేసీఆర్


యాలాల: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

యాలాల: రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న బీఆర్ఎస్ (భారత రైతు సమితి)గా గుర్తింపు పొందుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీపై హర్షం వ్యక్తంచేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా, హాజీపూర్ సర్పంచ్ ఒంగోనిబాయి ఉన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: రైతు రుణమాఫీ పట్ల హర్షం వ్యక్తంచేస్తూ.. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో రుద్రారంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: రైతు రుణమాఫీ ప్రకటనతో మండల కేంద్రం, దుగ్గాపూర్, తదితర గ్రామాల్లో రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ పాష, నాయకులు నరేష్‌రెడ్డి, శీబ్లీ, ప్రసాద్, రంగయ్య, చందర్, రాములు ఉన్నారు.

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంజుగుల నర్సిరెడ్డి(రాజు) అన్నారు. రాష్ట్రంలో ఒకేసారి రూ.19 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందని చెప్పారు. ఈ మేరకు అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు.

◆ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం



పూడూరు: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నర్సమ్మ అన్నారు. శుక్రవారం పూడూరు మండల సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిపాలు పట్టడం వలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సర్పంచ్ సంధ్య, అంగన్ వాడీ టీచర్ అరుణాదేవి, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

◆ పోలింగ్ కేంద్రాల పరిశీలన

కుల్కచర్ల: ఎన్నికల కమిషన్, జిల్లా ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం అల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, గదుల్లో వెలుతురు సరిగ్గా ఉందా, లేదా, తాగునీటి సదుపాయం, మూత్ర శాలలు సక్రమంగా ఉన్నాయా? లేవా అని పరిశీలించినట్లు పేర్కొన్నారు. పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్